RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 5 | సంపుటి : 4 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 07-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

### నీలగిరి నిత్యపద్యం

**ఆటవెలది**

మనిషి మారడనుచు మగనిగూర్చి సతియు
సతిని గెలువలేక పతియుగూడ
అరమరికలు లేక యనుబంధముతోడ
మెలుగునట్టి జంట వెలుగునిలన

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



# పంజాబ్ కింగ్స్‌పై సన్ రైజర్స్ జయభేరీ

- ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచులో 33 పరుగుల తేడాతో విజయం
- టేబుల్ టాపర్గా అవతరించిన సన్ రైజర్స్
- హ్యాట్రిక్ ఓటములు చవిచూసిన పంజాబ్ కింగ్స్

**న్యూఢీల్లీ**

ఐపీఎల్ 2026లో టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్‌కు షాక్ ఇస్తూ.. సన్ రైజర్స్ హైదరాబాద్ ఘన విజయం సాధించింది. బుధవారం ఉప్పల్ వేదికగా జరిగిన మ్యాచులో 33 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో పంజాబ్ కింగ్స్‌ను వెనక్కి నెట్టి పాయింట్స్ టేబుల్‌లో -మిగతా 2 లో



## భారత్-వియత్నాం ద్వైపాక్షిక వాణిజ్యం

**25 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యం**

ద్వైపాక్షిక సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేర్చాలని భారత్, వియత్నాం నిర్ణయించాయి. ఆర్థిక, రక్షణ సహకారాన్ని మరింత విస్తరించాలని నిశ్చయించాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్న అవగాహనకు వచ్చాయి. ఇరుపక్షాలు 13 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాలు డిజిటల్ చెల్లింపులు, అరుదైన ఖనిజాలు, ఫార్మాస్యూటికల్స్, విద్య, బ్యాంకింగ్, సంస్కృతితో సహా పలు రంగాలలో లోతైన ద్వైపాక్షిక సంబంధాలకు అవకాశం కల్పిస్తాయి.

2 లో

# మెట్రోలో కేంద్రం భాగస్వామి కావాలి


**ఎయిర్‌పోర్ట్-ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్-3 కింద చేపట్టండి**


- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి విన్నతి
- డీపీఆర్‌ను సమర్పించామని వివరణ
- ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ కోసమే ప్రభుత్వ ఆధీనంలో ఫేజ్ 1



**హైదరాబాద్**

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం తెలపాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్-2 సమగ్ర ప్రజాలికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ మెట్రో ఫేజ్-2, మెట్రో ఫేజ్-3పై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో -మిగతా 2 లో





## విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

- 118 మంది ఎమ్మెల్యే మద్దతు తప్పనిసరి
- మద్దతు ఇచ్చే పార్టీల లేఖలు అవసరమని సూచన
- పూర్తి మెజార్టీ ఉంటే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం
- గవర్నర్ విశ్వనాథ్‌తో భేటీలో విజయ్‌కు స్పష్టీకరణ
- నేటి ప్రమాణ స్వీకారంపై సందిగ్ధత

**చెన్నై,**

టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాక్ ఇచ్చారు. తగినంత మెజారిటీ చూపించలేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరించారు. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో తక్షణం ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతోంది. మద్దతు ఎమ్మెల్యేలు లేదా పార్టీల జాబితా సమర్పించాలని, అప్పడే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పలుకుతామని స్పష్టం చేసినట్లు సమాచారం. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలుపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకుంటానని విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. అయితే విజయ్ వివరణతో గవర్నర్ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల -మిగతా 2 లో

## మోడీ టూర్ షెడ్యూల్ ఇదీ!

- ఈ నెల 10న రాష్ట్రానికి రాక
- మధ్యాహ్నం మూడింటికి హైటెక్స్ నుంచి వర్చువల్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం
- సాయంత్రం ఐదున్నరకు పరేడ్ గ్రౌండ్స్‌లో పబ్లిక్ మీటింగ్



**హైదరాబాద్,**

దేశ ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్ర పర్యటన ఖరారు అయ్యింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని పర్యటన పురస్కరించుకుని ప్రత్యేక బందోబస్తు నిర్వహించనుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించనున్న రూ. 7,800 కోట్ల విలువ చేసే అభివృద్ధి కార్యక్రమాలకు రాజధాని నగరం హైదరాబాద్‌లోని హైటెక్స్ నుంచి ఈ నెల 10న ప్రధాని మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని... -మిగతా 2 లో

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ

- ప్రభుత్వం మౌనంగా ఉండడం సరికాదు
- రౌండ్ టేబులు సమావేశంలో కవిత



**హైదరాబాద్,**

ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. విద్య ద్వారానే సమానత్వం, స్వేచ్ఛ సాధ్యమని కవిత అన్నారు. 'నాణ్యమైన విద్య - ఫీజుల నియంత్రణ'పై ఆమె రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. -మిగతా 2 లో

## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

- సీఎం అభ్యర్థిపై బీజేపీలో సమాలోచనలు
- ప్రమాణస్వీకారానికి భారీగా ఏర్పాట్లు




**కోల్‌కతా,**

పశ్చిమ బెంగాల్‌లో స్పష్టమైన ఆధిక్యం సాధించడంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే -మిగతా 2 లో




## ధాన్యం కొనుగోళ్లపై బిఆర్ఎస్ విష ప్రచారం

- 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచాన
- 95 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- పౌరసరఫరాశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి

**హైదరాబాద్,**

:ధాన్యం కొనుగోలు విషయంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తూ.. రైతులను ఆందోళనకు గురిచేయడంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు అంశంపై ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ గోబెల్స్ ప్రచారం చేస్తూ, రైతులను అయోమయానికి గురిచేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. తమ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరిస్తోందని, రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. -మిగతా 2 లో

# రైతుబంధు ఆపిందెవరు?

**రైతుబీమా, బోనస్‌ను బొంద పెట్టిందెవరు?**

- మోసం చేసి గద్దెనెక్కి రైతు వారోత్సవాలా?
- సీఎం ఢిల్లీకి చక్కర్లు కొట్టుడు తప్ప చేసిందేంటి?
- ప్రజల గురించి పట్టించుకునే దిక్కు లేదు
- వరంగల్ రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్



**హైదరాబాద్,**

: రైతుబంధును ఆపి, రైతుబీమాను బొందపెట్టిందెవరు? రూ.2లక్షల రుణమాఫీ, రూ.500 బోనస్ ఎగ్గొట్టిందెవరు? అంటూ కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రైతుబంధు పథకాన్ని ఆపడానికి తామేమైనా దివానాగాళ్లమా? అని రేవంత్‌రెడ్డి అన్నారని, ఇప్పుడు ఒక్కసారే వేసి మిగతా మూడుసార్లు ఆపిందెవరని కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎకే విమానం, దిగే విమానం తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని, రైతు వారోత్సవాల పేరుతో -మిగతా 2 లో




## కేరళ సీఎం ఎవరు?

- ఢిల్లీలో కాంగ్రెస్ మంతనాలు
- కీలక నేతలతో అధిష్ఠానం వరుస భేటీలు..
- మల్లికార్జున ఖర్గేతో సమావేశమైన రమేష్ చెన్నితల.. వీడీ సతీషన్
- రేసులో రమేష్ చెన్నితల, వీడీ సతీషన్, కేసీ వేణుగోపాల్ పేర్లు
- కేరళ సీఎం ఎంపికపై కొనసాగుతున్న సందిగ్ధత
- నేడు సీఎల్పీ సమావేశం.. శాసనపక్ష నేత ఎంపిక

**న్యూఢిల్లీ,**

కేరళ సీఎం ఎవరు.. అన్నదానిపై ఉత్కంఠ నెలకొన్నది. కేరళలో యూడీఎఫ్ కూటమి భారీ విక్టరీ సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎంపికపై దేశ రాజధాని ఢిల్లీలో మంతనాలు కొనసాగుతూనే ఉన్నాయి. సీఎం ఎవరికి ఇవ్వాలన్న దానిపై అధిష్ఠానం వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. ఈ మేరకు బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితల, వీడీ సతీషన్ భేటీ అయ్యారు. అయితే, సీఎం రేసులో వీడీ సతీషన్, రమేష్ చెన్నితల, కేసీ వేణుగోపాల్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రేసులో రమేష్ చెన్నితల.. వీడీ సతీషన్.. కేసీ వేణుగోపాల్ పేర్లు కేరళ అసెంబ్లీ ఎన్నికలలో యూడీఎఫ్ నాయకత్వంలోని భారీ విజయం సాధించింది. ఇప్పుడు కొత్త ముఖ్యమంత్రి ఎంపిక ప్రక్రియ ఢిల్లీ వేదిక అయ్యింది. -మిగతా 2 లో

## పంజాబ్ కింగ్స్‌పై సన్ రైజర్స్ జయభేరీ

మొదటి తరువాయి

అగ్రస్థానానికి చేరింది. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌కు ఇది వరుసగా మూడో ఓటమి కాగా, సన్ రైజర్స్ హైదరాబాద్‌కు మొత్తంగా ఏడో విజయం. ఓడిపోయినా.. పంజాబ్ కింగ్స్ బ్యాటర్ కూపర్ కన్నోలీ అజేయ శతకంతో ఒంటరిపోరాటం చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్ రైజర్స్.. 235/4 పరుగులు చేసింది. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్.. ఆదిలోనే వికెట్లు కోల్పోయింది. ప్రియాన్ష్ ఆర్యా (1), ప్రభ్‌సిమ్రాన్ (3), శ్రేయస్ అయ్యర్ (5) త్వరగా పెవిలియన్ చేరిపోయారు. దీంతో 23 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పంజాబ్ కష్టాల్లో పడింది. మార్కస్ స్టోయినిస్ (28), సూర్యాన్ష్ షెడ్గే (25), మార్కో జాన్సెన్ (19) ఎక్కువ సేపు క్రీజులో నిలవలేదు. దీంతో పంజాబ్ ఆలౌట్ అయ్యేలా కనిపించింది. కానీ సహచర బ్యాటర్లు విఫలమైన ఇదే పిచ్‌పై కూపర్ కన్నోలీ (59 బంతుల్లో 107 రన్స్) అజేయ శతకంతో సత్తాచాటాడు. చివరి ఓవర్‌లో శతకం పూర్తి చేసుకున్న అతడు.. జట్టుకు ఓటమి అంతరాన్ని తగ్గించాడు. ఈ మ్యాచులో ఓడినా.. భారీగా నెట్ రన్ రేట్ పడిపోకుండా కాపాడాడు. చివరకు పంజాబ్ కింగ్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. సన్ రైజర్స్ హైదరాబాద్ 33 పరుగుల తేడాతో విక్టరీ సాధించింది. ఈ విజయంతో సన్ రైజర్స్ హైదరాబాద్.. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్, డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వెనక్కి నెట్టి మరి.. టేబుల్ టాపర్‌గా నిలిచింది. ఇప్పటికే ఏడు విజయాలు సాధించిన సన్ రైజర్స్.. ప్లే ఆఫ్స్‌కు చేరువైంది. మరొక్క మ్యాచులో గెలిస్తే.. ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించనుంది!

## మెట్రోలో కేంద్రం భాగస్వామి కావాలి

మొదటి తరువాయి

ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశంతోనే మెట్రో ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం వివరించారు. ప్రస్తుతం ఫేజ్-1 ప్రభుత్వం పరిధిలో ఉండడంతో ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ సులభమవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్-2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 ప్రాజెక్టును భారత ప్రభుత్వం - తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ -- భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్-3 గా చేపట్టాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-3 కి సంబంధించిన డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

మొదటి తరువాయి

బలం అవసరం కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి టీవీకే వద్ద ప్రస్తుతం 112 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విజయ్ రెండు సీట్లలో గెలవడంతో ఒక సీటును వదులుకోవడం అనివార్యం. దీంతో టీవీకే చేతిలో 107 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నట్టయింది. కాంగ్రెస్ బలం కూడా కలిపితే టీవీకే బల నిరూపణకు మరో 6 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఐడీఎంకే 47 సీట్లలో గెలవగా, అందులోని ఒకవర్గం టీవీకే వైపు మొగ్గుచూపుతోంది. పీఎంకే-4, ఐయూఎంఎల్-2, సీపీఐ-2, సీపీఎం-2, డీఎండీకే, ఐఎంఎంకే చెరో సీటు కలిగి ఉన్నాయి. టీవీకేకు చిన్న పార్టీల నుంచి మద్దతు లభించే అవకాశాలు బలంగానే ఉన్నాయి. అయితే అధికారికంగా మద్దతు ఇస్తేనే సంఖ్యాబలాన్ని విజయ్ చూపించుకునే అవకాశం ఉంటుంది. టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కాగా, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా ఈనెల 7వ తేదీన విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ఏర్పాట్లు కూడా చేసుకున్నారు.. మంచి ముహూర్తం కావడంతో ఉదయం 10 గంటల నుంచి 11.15 గంటల మధ్య విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 5,000 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసి ఉదయం గురువారం 6 గంటల కల్లా సిద్ధం చేయనున్నట్టు టీవికే వర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం కావడంతో స్టేడియం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## మోడీ టూర్ షెడ్యూల్ ఇదీ!

మొదటి తరువాయి


నరేంద్ర మోడీ బెంగళూరు నుంచి ప్రత్యేక విమానం ద్వారా హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి మధ్యాహ్నం గం. 2.25 ని.లకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో గం. 2.30 గంటలకు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించే హైటెక్స్‌కు చేరుకుంటారు. అక్కడ గం. 2.30 నుంచి గం. 3ల వరకు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలతో పాటు, ప్రారంభోత్సవాలను వర్చువల్ గా ప్రారంభిస్తారు. ఆ తర్వాత తిరిగి రోడ్డు మార్గంలో గం. 3.05 ని.లకు బయలుదేరి గం. 3.10 ని.కు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అనంతరం గం. 3.15 ని.లకు రక్షణ శాఖ హెలికాప్టర్ (ఎంఐ-17) ద్వారా హైటెక్స్ హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి గం. 3.40 ని.లకు రోడ్డు మార్గంలో హైటెక్ సిటీ సమీపంలోని సింధూ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి బయలుదేరి గం. 3.45 ని.లకు చేరుకుంటారు. ఈ సందర్భంగా గం. 3.45 ని.ల నుంచి గం. 4.15 ని.ల వరకు సింధూ హాస్పిటల్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారు. సింధూ హాస్పిటల్ నుంచి గం. 4.15 ని.లకు బయలుదేరి హైటెక్ సిటీ మీదుగా రోడ్డు మార్గంలో గం. 4.40 ని.లకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఈ సందర్భంగా బేగంపేట ఎయిర్ పోర్టు వద్ద గం. 4.40 ని.ల నుంచి సాయంత్రం గం. 5.25 ని.ల వరకు విశ్రాంతి తీసుకోనున్నారు. సాయంత్రం గం. 5.25 ని. నుంచి బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి రోడ్డు మార్గంలో గం. 5.30 ని.లకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో బీజేపీ పార్టీ నిర్వహించనున్న బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ సాయంత్రం గం. 6.30 ని వరకు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ నుంచి గం. 6.35 నుంచి గం. 6.40 వరకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు రోడ్డు మార్గంలో చేరుకుంటారు. బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి గం. 6.45 ని.లకు బయలుదేరి ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానం ద్వారా రాత్రి గం. 8.45 వరకు గుజరాత్ లోని జామ్ నగర్‌కు ప్రధాని చేరుకుంటారు.

# భారత్-వియత్నాం ద్వైపాక్షిక వాణిజ్యం

మొదటి తరువాయి

**న్యూఢిల్లీ:**

ద్వైపాక్షిక సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేర్చాలని భారత్, వియత్నాం నిర్ణయించాయి. ఆర్థిక, రక్షణ సహకారాన్ని మరింత విస్తరించాలని నిశ్చయించాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్న అవగాహనకు వచ్చాయి. ఇరుపక్షాలు 13 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాలు డిజిటల్ చెల్లింపులు, అరుదైన ఖనిజాలు, ఫార్మాస్యూటికల్స్, విద్య, బ్యాంకింగ్, సంస్కృతితో సహా పలు రంగాలలో లోతైన ద్వైపాక్షిక సంబంధాలకు అవకాశం కల్పిస్తాయి. భారత పర్యటనకు వచ్చిన వియత్నాం అధ్యక్షుడు టో లాం ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త సమావేశంలో మోడీ ప్రసంగించారు. భారత్ అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్' విధానంలో వియత్నాం కీలక దేశమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. వియత్నాం సహకారంతో ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలను మరింత విస్తరిస్తామని చెప్పారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, శ్రేయస్సు కోసం వియత్నాంతో కలిసి భారత్ పని చేస్తుందని తెలిపారు. పఠాన్‌కోట్ ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం చేస్తున్న పోరాటంలో అండగా నిలిచినందుకు వియత్నాంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక అనుసంధానతను పెంపొందించేందుకు రెండు దేశాల



కేంద్ర బ్యాంకుల మధ్య సహకారాన్ని బలోపేతం చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మోడీ వెల్లడించారు. ఇందులో భాగంగా యూపీఐ వ్యవస్థను వియత్నాం ఫాస్ట్ పేమెంట్ సిస్టమ్‌తో త్వరలో అనుసంధానం చేయనున్నట్లు ప్రధాని వివరించారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 25 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మోడీ తెలిపారు. ఇరు దేశాల మధ్య భద్రత సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు వియత్నాం అధ్యక్షుడు టో లాం తెలిపారు. "2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 25 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లేందుకు అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం. మన ఔషధ అధికార వర్గాల మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం వియత్నాంలో భారతీయ ఔషధాల లభ్యతను పెంచుతుంది. వియత్నాంకు భారతీయ వ్యవసాయ, మత్స్య, పశు ఉత్పత్తుల ఎగుమతి కూడా సులభతరం కాబోతోంది. "త్వరలోనే భారతదేశపు ద్రాక్ష, దానిమ్మ పండ్లను వియత్నాం రుచి చూస్తుంది, అలాగే మనం వియత్నాం పోమెలో పండ్లను రుచి చూస్తాము. అంతేకాకుండా, ఈ ఏడాది చివరి నాటికి భారత్-ఆసియాన్ వాణిజ్య ఒప్పందాన్ని ఆధునీకరించడానికి అంగీకరించాం. ఇది భారతదేశానికి, అన్ని ఆసియాన్ దేశాలకు మధ్య వాణిజ్యానికి, పెట్టుబడులకు కొత్త ఊపునిస్తుంది. కీలక ఖనిజాలు, అరుదైన భూలోహాలు, ఇంధన సహకారంలో కొత్త కార్యక్రమాలు మన రెండు దేశాల ఆర్థిక భద్రతను, సరఫరా గొలుసు మెరుగుపరుస్తాయి. అనుసంధానం, సామర్థ్య నిర్మాణం మన భాగస్వామ్యానికి ముఖ్యమైన స్తంభాలు. రెండు దేశాల మధ్య విమాన అనుసంధానం నిరంతరం పెరుగుతుండటం చాలా సంతోషంగా ఉంది." అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. దక్షిణ చైనా సముద్రంలో చైనా తన సైనిక బలాన్ని పెంచుకుంటున్న విషయం కూడా ఇరుపక్షాల మధ్య జరిగిన ప్రతినిధి బృందం స్థాయి చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో కలిసి వచ్చిన వియత్నాం అధ్యక్షుడు లాం, మూడు రోజుల భారత్ పర్యటించనున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన దేశంలో చేస్తున్న తొలి అధికారిక పర్యటన ఇది. అంతకుముందు మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం లభించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మరియు ప్రధానమంత్రి మోడీ ఆయనకు స్వాగతం పలికారు. ఢిల్లీకి వచ్చేముందు బిహార్‌లోని బోధ్ గయలోనూ పర్యటించి మహాబోధి ఆలయంలో ప్రార్థనలు చేశారు.

# రైతుబంధు ఆపిందెవరు?

మొదటి తరువాయి

డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు.

**రైతులను ఉరికించి రేవంత్ మోసగించారు**

పదేండ్ల కేసీఆర్ పాలనలో అంతా సాఫీగా సాగుతుంటే కాంగ్రెస్ అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చి అన్నివర్గాలను మోసం చేస్తున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కేసీఆర్ పదివేలే ఇస్తుండు.. మేం రూ.15 వేలు ఇస్తాం. ఇప్పుడు తీసుకుంటే ఐదు వేలే.. డిసెంబర్‌లో తీసుకుంటే రూ.7,500 అంటూ సన్నాయి నొక్కులు నొక్కారు. ఉరుకుండ్రి రూ.2 లక్షలు అప్పు తెచ్చుకోండ్రి. డిసెంబర్ 9న సంతకం పెడుతామని ఉరికించి రైతులను మోసం చేశార'ని నిప్పులు చెరిగారు. కాంగ్రెసోళ్లను నమ్మి మోసపోతే గోసపడుతామని కేసీఆర్ చెప్పిండు. అప్పుడు రేవంత్‌రెడ్డి మేమేమన్నా హౌలాగాళ్లమా.. దివానాగాళ్లమా అని మాట్లాడిండు' అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కౌలు రైతులకు, రైతు కూలీలకు అందరినీ ఆదుకుంటామని రేవంత్ మోసం చేశారని విమర్శించారు.తెలంగాణ వార్తలు

**రైతుకు భూదేవికి ఉన్నంత ఓపిక**

రైతుకు భూదేవికి ఉన్నంత ఓపిక ఉంటదని కానీ ఓపి క నశిస్తే భూకంపం పుట్టించే శక్తి అదే రైతుకు ఉంటదని కేటీఆర్ చెప్పారు. 'రేవంత్ యాది పెట్టుకో! దేశానికి అన్నం పెట్టే అన్నదాతను అడుక్కునేటోనిలా చూస్తున్నవ్. కేసీఆర్ మీటింగ్ పెట్టగానే ఒక కిస్తు.. రెండో మీ టింగ్ పెడ్తే ఇంకో కిస్తు. మార్చిలో ఒక ఎకరం. ఏప్రిల్‌లో ఇంకో ఎకరానికి ఇస్తా అని తమాషాలు చేసుకుంట, బట్టేబాజీ మాటలు, బలుపు మాటలు మాట్లాడున్నడు..



నా ఇష్టం వచ్చినప్పుడు వేస్తా అంటే నీ ఇంటిముందు జోలె పట్టుకొని నిల్చునేటందుకు రైతులేమన్నా బిచ్చగాళ్లా? రైతుకు నాగలితో దున్నడం తెలుసు. అదే నాగలిని తిరగేసి కాంగ్రెసోళ్లను ఊరూరికి ఉరికిచ్చి ఉరికిచ్చి కొట్టడం కూడా తెలుసు' అని కేటీఆర్ హెచ్చరించారు.

**రేవంత్ రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యూవల్ సీఎం**

రాష్ట్రంలో రైతుబంధు వేసేందుకు సీఎం వద్ద డబ్బులు లేవు కానీ, రాహుల్‌గాంధీకి మూటలు పంపేందుకు మాత్రం డబ్బులు ఉంటాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రైతుబంధు పోయి రాహుల్‌బంధు అమలవుతున్నదని విమర్శించారు. అందుకే ఆయన రెగ్యుల్ సీఎం కాదు.. రెన్యూవల్ సీఎం. నెలకోసారి కప్పం కట్టి రెన్యూవల్ చేయించుకోవాలి. లేకుంటే రేవంత్‌కు బతుకుదెరువు లేదు. కుర్చీ గుంజిపడేస్తరు. రైతులకు ఎగ్గొట్టి రాహుల్‌కు కప్పం కట్టి కుర్చీని కాపాడుకుంటున్న రేవంత్‌రెడ్డి యాది పెట్టుకో.. రైతులకు కోపం వచ్చిననాడు ఏ రాహుల్‌గాంధీ.. ఏ సోనియాగాంధీ.. ఏ ప్రియాంకాగాంధీ నీ కుర్చీని కాపాడలేరు. గుర్తు పెట్టుకో ఒక్కో ఎకరానికి రూ.26,500 బాకీ పడ్డరు. రూ.30వేల కోట్లు రైతులకు బాకీ పడ్డదు రేవంత్‌రెడ్డి' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**ఏతుల.. ఎగవేతల రేవంత్‌రెడ్డి**

'ఓట్లకు ముందు ఏతులు.. ఓట్లేసుకున్నంక ఎగవేతలు. ఏ రేవంత్‌రెడ్డి అంటే ఏతుల రేవంత్‌రెడ్డి, ఎగవేతల రేవంత్‌రెడ్డి' అని కేటీఆర్ అభివర్ణించారు. 'చివరి ఆరు నెలలకు మళ్లీ ప్రజలను మోసం చేయవచ్చని అనుకుంటున్నరు. యూరియా కష్టాలు, మక్కల రైతుల పడిగాపులు అన్నీ మర్చిపోతరు అనుకుంటున్నరు. రుణమాఫీ పంచపాండవులు మంచంకోళ్ల కథలెక్క ఉన్నది. ఒక్క ఊర్ల కూడా రుణమాఫీ కాలే. రేవంత్‌రెడ్డీ నీకు దమ్ముంటే ఏ ఊరికి పోదామో చెప్పు? నీ కొండారెడ్డిపల్లికి పోదా మా? గంగదేవిపల్లికి పోదామా? కొడంగల్‌కు పోదా మా? ఏ ఊరికి పోదామో చెప్పు ఏ ఊరిలోనైనా రైతులు 100శాతం రుణమాఫీ జరిగిందని రాసిస్తే శాశ్వతంగా నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా' అని కేటీఆర్ సవాల్ విసిరారు. 'దమ్ముంటే సవాల్ స్వీకరించు.. రేవంత్‌రెడ్డి వస్తడా? తుమ్మల వస్తడా రండి. చారాణా జరిగింది వాస్తవమా కాదా?' అని ప్రశ్నించారు.

## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

మొదటి తరువాయి

అంశంపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో వరుసగా చర్చలు జరుపుతోంది. దీనిపై కసరత్తు జరుగుతుండగానే 9న ప్రమాణ స్వీకార ఏర్పాట్లు సాగుతున్నారు. బెంగాల్ నేత ఎంపికకు పరిశీలకుడిగా కేంద్రహోంమంత్రి అమిత్ షా రానున్నారు. అందుకే మే 9వ తేదీ శనివారం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య బుధవారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసనసభా పక్ష సమావేశం జరుగుతుందని సమిక్ భట్టాచార్య తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేతను పార్టీ ఎమ్మెల్యేలు అంతా కలిసి ఎన్నుకుంటారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్రం మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయే నాయకులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా కొలువుదీరనున్న మంత్రి వర్గంలో దాదాపు 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయకత్వం చెబుతుంది. మరోవైపు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికే దృష్టి కేంద్రీకరించారు.

## ధాన్యం కొనుగోళ్లపై బిఆర్ఎస్ విష ప్రచారం

మొదటి తరువాయి

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఈ రబీలో రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. దాదాపు 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. ఇందులో భాగంగా 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం 2.63 లక్షల టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అకాల వర్షాలు, తీవ్రమైన ఎండల (హీట్ వేవ్) నుంచి ధాన్యాన్ని, రైతులను రక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దు, ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది' అని మంత్రి ఉత్తమ్ అన్నారు. తడిసిన ధాన్యాన్ని ఏం చేయాలి అనేది కూడా అధికారులకు సూచనలు చేశామని అన్నారు. ప్రతి కొనుగోలు సెంటర్లలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని.. ధాన్యం కొనుగోలుకు సంబంధించి సివిల్ సప్లై భవన్ లో కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి రోజు వెదర్ అలర్ట్ అన్ని కొనుగోలు సెంటర్లకు అందిస్తున్నామని..తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే రాష్ట్రంలో ఎక్కువ కొనుగోలు సెంటర్ల ను ఏర్పాటు చేశామని... బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కంటే కాంగ్రెస్ హయంలో ఎక్కువ మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ఏ రైతుకు ఇబ్బంది వచ్చిన కంట్రోల్ సెంటర్ కు పిర్యాదు చేయొచ్చని అన్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ

మొదటి తరువాయి

ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాల భాధ్యతేనని నమ్మిన ప్రభుత్వాలు ఉండాలన్నారు. ఫీజులు ఎంత పెంచినా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని చెప్పారు. ఇప్పుడున్న చాలా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో ఉన్నవేపపి, వాటిలో రాజకీయ నాయకులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయన్నారు. . రాజకీయ నాయకులకు విద్యాసంస్థలు ఉండటమనేది సరైనదేనా మనం ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి ఇప్పుడే పరిష్కారం కావాలని అన్నారు. తెలంగాణ వచ్చాక ఫీజుల నియంత్రణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి రిపోర్టు కూడా ఇచ్చింది. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. గురుకులాలు ఏర్పాటు చేశామని.. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోబోమంటే కుదరదు. మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలి. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే ఇవ్వాలి. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్‌లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు? ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా అని కవిత ప్రశ్నించారు.

## కేరళ సీఎం ఎవరు?

మొదటి తరువాయి

140 స్థానాలు ఉన్న కేరళ అసెంబ్లీలో యూడీఎఫ్ కూటమి 102 స్థానాలను గెలిచి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీని సాధించింది. అయితే, కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలనలో ప్రస్తుతం ముగ్గురు ప్రధాన నేతల పేర్లు వినిపిస్తున్నాయి. ఇందులో అడ్వకేట్ వీడీ సతీషన్ ప్రతిపక్ష నేతగా పార్టీని విజయపథంలో నడిపించడంలో కీలక పాత్ర పోషించారు. కూటమిలోని ముస్లిం లీగ్ మిత్రపక్షాల మద్దతు కూడా ఈయనకు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది.

ఇక రెండో సీనియర్ నేత అయితే మాజీ మంత్రి రమేష్ చెన్నితల పార్టీ కష్టకాలంలో ఉన్నవేళ అండగా నిలిచిన వ్యక్తి. ఢిల్లీలో ఇవాళ ఈయన మల్లికార్జున ఖర్గేతో మంతనాలు జరపడం ప్రాధాన్యం సంతరించుకున్నది. ఇతని పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. అలాగే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు వినిపిస్తోంది. కాంగ్రెస్ అగ్రనేత, లోకసభ పక్ష నేత రాహుల్ గాంధీకి కేసీ వేణుగోపాల్ అత్యంత సన్నిహితుడు. జాతీయ రాజకీయాలలో కీలక పాత్రను పోషిస్తున్నప్పటికీ కేరళకు సీఎంగా రావాలని అధిష్ఠానం భావిస్తే ఈయన పేరు ఖరారయ్యే అవకాశం ఉన్నది. సీఎం అభ్యర్థిగా ఎలాంటి విభేదాలు తలెత్తకుండా హైకమాండ్ చాలా జాగ్రత్త పడుతోంది.

కేరళకు.. అబ్జర్వర్లు..

అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్‌లను కేరళ అబ్జర్వర్లుగా నియమించింది. బుధవారం రాత్రికి అబ్జర్వర్లు చేరుకుంటారని కేరళ కాంగ్రెస్ ఇంఛార్జి దీపా దాస్ మున్షీ తెలిపారు. కొత్తగా ఎన్నికైనటువంటి కాంగ్రెస్ ఎమ్మెల్యేల అభ్యర్థులుగా వ్యక్తిగతంగా మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించనున్నారు. తరువాత సీల్డ్ కవర్‌లో ఎమ్మెల్యేల అభిప్రాయాలను నివేదిక రూపంలో హైకమాండ్‌కు అందజేయనున్నారు. చివరగా సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గేల చేతుల మీదుగా సీల్డ్ కవర్ ద్వారా వెలువడే అవకాశం ఉన్నది.

# ప్రజాపాలనలో రైతులకు ఎంతో మేలు





- చైర్ పర్సన్ యాట గీత నర్సింహా
- ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న చైర్ పర్సన్ యాట గీతా నర్సింహా
- మార్కెట్ యార్డులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గీత నర్సింహా

**ఆమనగల్లు, మే 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని మార్కెట్ చైర్ పర్సన్ యాట గీతా నర్సింహా అన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ దేశంలో అగ్రభాగాలా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. ఆమనగల్లు మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం గీతా నర్సింహా సందర్శించారు. మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, పీఏసీఎస్ సీఈవో పద్మాకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ లతో కలిసి మార్కెట్ యార్డు ఆవరణను , కొనుగోలు కేంద్రంలో విక్రయానికి తెచ్చిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. వేసవి నేపథ్యంలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గీత నర్సింహా ప్రారంభించారు. మార్కెట్ యార్డ్ ఆవరణలోకి పందులు రాకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర రెడ్డికి సూచించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించి రైతులకు మద్దతు ధర కల్పిస్తున్నట్లు చెప్పారు. సన్న వరి ధాన్యానికి క్వింటాలకు రూ.500 ప్రోత్సాహక అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది అన్నారు. రాబోవు ఖరీఫ్ సీజన్ కు రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. రైతులను మోసగిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని గీత నర్సింహా హెచ్చరించారు. మార్కెట్ యార్డులో రైతులకు మెరుగైన వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో హాస్టల్లో సాగు విస్తీర్ణం పంటల దిగుబడి గణనీయంగా పెరిగింది అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, మిట్టపల్లి అంజయ్య, తాళ్ల రవీందర్, పొట్టేళ్ల యాదయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్, నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యంగునికి వీల్‌చైర్ అందజేత



**జవహర్‌నగర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గబ్బిలలపేటలో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన దివ్యాంగుడు శివకుమార్ చిన్ననాటి పోలియో వ్యాధి కారణంగా రెండు కాళ్లు పనిచేయక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. బయటకు వెళ్లడానికే కష్టాలు పడుతున్న అతనికి వీల్‌చైర్ అందజేయడం జరిగింది.తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరుగు శివకుమార్ సమాచారం అందించగా, జర్నలిస్టు పంభోజు గంగాధర్ కుటుంబం స్పందించింది. బుధవారం వారి కుమారుడు పంభోజు సాయి కృష్ణ జన్మదినం సందర్భంగా శివకుమార్‌కు వీల్‌చైర్ అందజేశారు.ఈ సందర్భంగా శివకుమార్ తన పరిస్థితిని గుర్తించి సహాయం చేసిన గంగాధర్--గీత దంపతులకు, సాయి కృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శంకర చారి, రాము, కూచిల్ తదితరులు పాల్గొన్నారు.

## తడకమళ్ళలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం



**మిర్యాలగూడ, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తడకమళ్ళ గ్రామపంచాయతీలో నూతన ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.లబ్ధిదారులతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం ప్రారంభించిన అనంతరం వారికి షాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. లబ్ధిదారులు తమ సొంతింటి కలను నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే బీఎల్ఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ, “ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి లబ్ధిదారుడికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ, పార్టీలు--కులాలకు అతీతంగా అర్హత ఆధారంగా ఇళు మంజూరు చేస్తున్నాం. నియోజకవర్గంలో ఇప్పటివరకు 3,500 ఇళ్లు ఇచ్చాం, మిగిలిన వారికి కూడా త్వరలో ఇళ్లు అందిస్తాం. ప్రతి ఒక్కరికీ గూడు, నీడ కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం” అని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మర్రిగూడలో మద్యం మత్తులో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

**మర్రిగూడ, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలో మద్యం మత్తులో ఉన్న వ్యక్తి ఒక ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన కలకలం రేపింది.నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాదుకు వెళుతుండగా, బైకు సైడ్ ఇవ్వలేదనే కారణంతో గొడవకు దిగిన వ్యక్తి డ్రైవర్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో డ్రైవర్ గాయపడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా






**ఆమనగల్లు, మే 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా అన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం పట్టణ కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని విస్మరించాయని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. ఏకకాలంలో రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. రైతుభరోసా పథకం కొనసాగింపుతో పాటు రైతు కూలీలకు ఇందిరమ్మ రైతుభరోసా అందిస్తున్నామని చెప్పారు. రైతుల ఆత్మగౌరవాన్ని పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొంటూ, భూ పరిరక్షణకు రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, తాళ్ళ రవీందర్, అంజయ్య గుప్తా, యాదయ్య గౌడ్, మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, ఏడీఏ శోభారాణి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, అసిస్టెంట్ రిజిస్టర్ సర్కిల్ ఇంచార్జ్ ఆంజనేయులు, సీఈఓ పద్మాకర్ రెడ్డి, సర్పంచులు యాదయ్య, ప్రశాంతి రవి కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, అగ్రికల్చర్ ఏవో, ఏఈఏ, ఆయా బ్యాంకుల మేనేజర్లు రైతులు నాయకులు దేవరశెట్టి మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి’

- సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా




**ఆమనగల్లు, మే 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** నీతి, నిజాయితీ, ధర్మం వంటి సత్యమార్గాలు బోధించిన సంత్ సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకుని సమాజం ముందుకెళ్లాలని ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. బుధవారం కడ్తాల్ మండలంలోని గానుగుమర్ల తండాలో నిర్మిస్తున్న తుల్జా భవాని ఆలయ నిర్మాణానికి ఆ తాండ సర్పంచ్ సేవ్య నాయక్ తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం సేవాలాల్ మెరియా యాడి ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గంప వెంకటేష్ మాట్లాడుతూ.. బంజారాల ఆరాధ్య దైవం తుల్జా భవాని మాతను స్మరిచుకోవడం తో పాటు ఆయన ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఆయన వెంట నాయకులు రాజు, హేమ్లు, బద్య, సక్రు, హరియా, జై, హరిచంద్, లక్ష్మణ్, పీర్య, పాండు, కిషన్, గ్రామ పెద్దలు పలువురు ఉన్నారు.

## ఘనంగా రైతు వారోత్సవాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



పాల్గొన్న రైతులు

**ఎలిగేడు, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సుల్తాన్‌పూర్ రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు.కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డా. బి. సతీష్ చంద్ర, రైతు విజ్ఞాన కేంద్రం కరీంనగర్ శాస్త్రవేత్త డా. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, “యూరియా వినియోగం తగ్గించి, పంట మార్పిడి పాటిస్తే చీడపీడలు తగ్గి అధిక దిగుబడులు, సుస్థిర ఆదాయం లభిస్తుంది” అని సూచించారు.సేంద్రియ పద్ధతులు, భూసార పరీక్షలు, నాణ్యమైన విత్తనాలు, మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాల సాగు, ఆయిల్‌పామ్ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కేవలం ప్రభుత్వం ధృవీకరించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ సత్యం



**ఆమనగల్లు, మే 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామంలో పిట్టల రాములయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ శానమోని సత్యం మృతుడి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. అధైర్య పడొద్దు అండగా ఉంటానని భరోసా కల్పించారు. తన వంతు తక్షణ సాయంగా 5000 రూపాయలు అందజేశారు. ఆయన వెంట ఉప సర్పంచ్ రవీంద్ర, వార్డు సభ్యులు అయోధ్య, గ్రామస్తులు వెంకటయ్య, శీను, శ్రీశైలం, మనీ తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఈశ్వరమ్మ వర్ధంతి కార్యక్రమాలు



మజ్జిగ పంపిణీ



మాతృపూజ కార్యక్రమం

**కరీంనగర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బస్టాండ్ చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ, సత్యసాయి మందిరంలో మాతృపూజ నిర్వహించారు.భగవాన్ బాబా తల్లిగారు ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా ఉదయం నగర్ సంకీర్తన, మధ్యాహ్నం వరకు మాతృపూజ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం సుమారు 300 మందికి మహా నారాయణ సేవ భోజనాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షులు, కన్వీనర్, సభ్యులు పాల్గొన్నారు.

## సమష్టిగా పనిచేసి మన్ననలు పొందాలి


- మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా



**ఆమనగల్లు, మే 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సమష్టిగా పనిచేసి ప్రజల మన్ననలు పొంది విజయవంతం కావాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా కోరారు. పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో బుధవారం ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ రాఘువేందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన అబ్దుల్ ఖాదర్ లను మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ తో కలిసి చైర్ పర్సన్ యాట గీత నర్సింహా ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డైరెక్టర్ అంజయ్య గుప్తా, మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రూపం వెంకట్ రెడ్డి, అబ్దుల్ రహీం తదితరులు ఉన్నారు.

## పీఏసీఎస్ చైర్మన్ గా గంప వెంకటేష్ బాధ్యతల స్వీకరణ

- అసిస్టెంట్ రిజిస్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో బాధ్యతలు చేపట్టిన గంప






**ఆమనగల్లు, మే 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** హైకోర్టు ఆదేశాల మేరకు ప్రాథమిక సహకార సంఘం పాలకవర్గం కొలువుదీరింది. బుధవారం ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గా గంప వెంకటేష్ గుప్తా బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా డీసీఓ కార్యాలయం నుంచి వచ్చిన అసిస్టెంట్ రిజిస్టర్ ఆంజనేయులు వెంకటేష్ గుప్తాకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా గంప వెంకటేష్ గుప్తా మాట్లాడుతూ.. గత ఆరు నెలలుగా సన్న చిన్నకార రైతులు ప్రాథమిక సహకార సంఘం వారి ఆజమాయిషి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు హైకోర్టు ఉత్తర్వులతో ప్రభుత్వం ఆగమేఘాల మీద సింగల్ విండో పాలకవర్గాలను కొనసాగిస్తూ జీవో విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలతో పాటు రైతులకు సబ్సిడీపై పంట రుణాలు అందివ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటామని వెంకటేష్ గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ఆమనగల్లు ప్రాథమిక సహకార సంఘం కార్యదర్శి పద్మాకర్ రెడ్డి, సిబ్బంది దేవేందర్, అల్లాజీ, మహేష్ పాల్గొన్నారు.

## అచ్చంపేటలో శాంతి కమిటీ సమావేశం




**అచ్చంపేట, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఈ నెల 27న జరగనున్న బక్రీద్ పండుగను మతసామరస్యంతో, శాంతియుతంగా నిర్వహించాలని అచ్చంపేట డిఎస్పీ శ్రీనివాసులు సూచించారు. శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, “యువత అవాంఛనీయ సంఘటనలకు దూరంగా ఉండాలి, మంచి మార్గంలో నడవాలి. మద్యం, అల్లర్లు, వివాదాలకు దూరంగా ఉండి శాంతి భద్రతలకు సహకరించాలి” అని అన్నారు. ఈ సమావేశంలో సిఐ నాగరాజు, ఎస్సై సద్దాం హుస్సేన్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో చెత్త సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు



**కరీంనగర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ ఆవరణలో చెత్తాచెదారం భారీగా పేరుకుపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త కుప్పల నుంచి వస్తున్న దుర్వాసనతో బస్సుల కోసం వేచి ఉన్న వారు ముక్కు మూసుకుని నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అపరిశుభ్రత కారణంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత మున్సిపల్, ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి బస్టాండ్‌ను శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధాన బస్టాండ్‌లో చెత్త సమస్యపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రైల్వే ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయాలి

**-ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ డిమాండ్.**



**దేవరకొండ మే 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** డిండి మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డ్ ఉద్యమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అఖిల భారత యువజన సమాఖ్య నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ హాజరై మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ద్వారా ప్రైమ్ మినిస్టర్ కు లెటర్ల ద్వారా రైల్వే శాఖలోని ఖాళీగా ఉన్నా 2.75 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ నియమాకాలు జరగడం లేదు అదే సమయంలో 2 శాతం ఉద్యోగాల కోత నిర్ణయం యువతకు అన్యాయమని,అఖిల భారత యువజన సమాఖ్య పక్షాన తెలియజేస్తున్నాం ఖాళీలు ఎందుకు భర్తీ చేయడం లేదు, ఆర్ ఆర్ బిఫలితాలు ఎందుకు పెండింగ్లో ఉన్నాయి,ఉద్యోగాల కోత ఎందుకు చేస్తున్నారు, రైల్వేలోని అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి, ఆర్ ఆర్ బిఫలితాల్లో తక్షణమే విడుదల చేయాలి,ఉద్యోగాల కోత నిర్ణయాన్ని రద్దు చేయాలి,యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలి ఉద్యోగం మాహక్కు మాపై అన్యాయం ఆపండనీ ప్రైమ్ మినిస్టర్ కు లెటర్ల ద్వారా నిరసన తెలియజేశారు .మా డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రైమ్ మినిస్టర్ ని కోరుతున్నాము. లేదంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని వారన్నారు. ఈ లెటర్లన్నీ ప్రైమ్ మినిస్టర్ కి చేరేలా పంపించాలని పోస్ట్ ఆఫీస్ అధికారికి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కోశాధికారి నాయక్ మధుకర్,ఎండీ ఆదిల్, బుషిపాక గోవర్ధన్,కళ్లెం సిద్దు, శశివరన్, రజినీకాంత్,కొండల్,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన వంటగ్యాస్ ధరలపై సీపీఐ ఆందోళన








**కల్వకుర్తి/తిమ్మాజిపేట/నాగర్‌కర్నూలు మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెరిగిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. కల్వకుర్తిలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట సిపిఐ నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు నేతృత్వంలో ఆందోళన జరిగింది. “సిలిండర్ ధర 450 రూపాయల నుంచి 900 రూపాయలకు పెరిగింది, కమర్షియల్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి” అని ఆయన విమర్శించారు. తిమ్మాజిపేటలో అంబేద్కర్ చౌరస్తా వద్ద సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మారేడు శివశంకర్, మండల కార్యదర్శి ఎస్.కె. ఖాజా మైనుద్దీన్ మాట్లాడుతూ, “బీజేపీ ప్రభుత్వం ప్రజల నడ్డి విరుస్తోంది. పెట్రోల్ బంకుల్లో స్టాక్ లేకపోవడం, సిలిండర్ బుకింగ్‌కు వారం పది రోజులు పడుతోంది” అని అన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా కేంద్రంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి పాల్గొని, “ఎన్నికల సమయంలో ధరలు పెంచమని చెప్పకుండా, పోలింగ్ ముగిసిన వెంటనే పెంచడం మోసపూరిత చర్య” అని విమర్శించారు. ఖాళీ సిలిండర్లతో సీపీఐ శ్రేణులు వినూత్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సిపిఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వంగూరులో రైతు వారోత్సవాలు




**వంగూరు, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వంగూరు రైతు వేదికలో రైతు వారోత్సవాలు నిర్వహించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం పాలెం శాస్త్రవేత్తలు డా. కడ సిద్ధప్ప, జీ. పార్వతి రైతులకు బ్యాంకు రుణాలు, సుస్థిర సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సూచించిన 6 అంశాలను వివరించారు. రైతులకు యూరియా వినియోగం తగ్గించడం, నేల సంరక్షణ, నాణ్యమైన విత్తనాలు, మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాల వాడకం, సేంద్రీయ వ్యవసాయం, పంట మార్పిడి, సాగునీటి ఆదా వంటి అంశాలపై సూచనలు చేశారు. రైతులు అడిగిన సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, వెటర్నరీ డాక్టర్ వై. మల్లేష్, సర్పంచ్ పురుగుల యాదయ్య, బ్యాంకు అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే సమ్మర్ క్యాంప్





**దేవరకొండ మే 06 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలోకరాటే సమ్మర్ క్యాంప్ ని డి ఎస్ పిశ్రీనివాస రావు , అధ్యక్షుడు ఎన్ విటి సభ్యులతో కలిసి ప్రారంభించినారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇలాంటి సమ్మర్ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కరాటే ముఖ్యంగా ఆడపిల్లలకు ఎంతో అవసరమని ఆత్మరక్షణ కోసం అని కరాటే అనేది జపాన్‌కు చెందిన ఒక ప్రాచీన, ప్రసిద్ధ యుద్ధ కళ ‘కరాటే’ అంటే జపనీస్ భాషలో “వట్టి చేతులు అని అర్థం, అంటే ఆయుధాలు లేకుండా కేవలం శరీర భాగాలను ఉపయోగించి చేసే ఆత్మరక్షణ విద్య. ఇది శారీరక దారుఢ్యంతో పాటు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, గౌరవం వంటి మానసిక విలువలను పెంపొందిస్తుంది అని అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్ ,కె పంతుల నాయక్ ,ఏటిఓ ఐడిప్రసన్న కుమార్, వైఎస్ కరుణాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వల్లమల్ల ఆంజనేయులు, ఎస్ ఎఫ్ ఐబుడగ వెంకటేష్ , ఎల్ ఐసియాదగిరి, రాము ,జమీర్, శ్రీను కరాటే మాస్టర్ గోపి, మాస్టర్స్ లచ్చిరాం, లక్పతి, సోమ్లా, అభినయ్, విద్యార్థులు, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు. కరాటే సమ్మర్ క్యాంపుకు రావాలనుకున్నవారు 9603174937 ఈ నెంబర్ ను సంప్రదించండి.

## సూదిని రాంరెడ్డి కి గ్రామ పంచాయతి ట్రిబ్యునల్ చైర్మన్ పదవి



**ఆమనగల్లు, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామ పంచాయతి ట్రిబ్యునల్ చైర్మన్‌గా మాడ్గుల్ మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సూదిని రాంరెడ్డిని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అదే విధంగా సభ్యులుగా కృష్ణ కుమార్ నాగులూరి, భూస వేణుగోపాల్ యాదవ్లను నియమించారు. ఈ ట్రిబ్యునల్ రెండేళ్ల పాటు కొనసాగి, గ్రామ పంచాయతీల వివాదాలు, ఎన్నికల కేసులు, ప్రజాప్రతినిధుల అనర్హత పిటిషన్లను విచారించనుంది. చైర్మన్‌గా నియమితులైన రాంరెడ్డిని కాంగ్రెస్ నాయకులు, కల్వకుర్తి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు అభినందించారు.

## గడ్డికట్టలు కట్టే యంత్రంపై పడి వ్యక్తి దుర్మరణం



**హుస్నాబాద్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగపూర్ గ్రామంలో గడ్డి కట్టలు కట్టే బేలర్ యంత్రంలో పడి రచ్చ సంపత్ (48) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంపత్‌కు భార్య, కుమారుడు సాయి కుమార్, కుమార్తె జ్యోతి ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కరీంనగర్ కార్పొరేషన్ నిర్లక్ష్యం

## రోడ్డుపై పారుతున్న తాగునీరు

**- గంజి మార్కెట్‌లో పైప్‌లైన్ లీకేజీతో వేల లీటర్ల వృథా**

**-- ప్రజలు, వ్యాపారుల ఆందోళన**

**కరీంనగర్, మే 5 (నీలగిరి ఎక్స్ప్రెస్):**
పట్టణ హృదయంలోని రద్దీ ప్రాంతం గంజి మార్కెట్‌లో తాగునీటి వృథా తీవ్ర సమస్యగా మారింది. చారి వాచ్ సెంటర్ సమీపంలో మున్సిపల్ పైప్‌లైన్ లీకేజీ కారణంగా విలువైన మంచినీరు రోడ్డుమీదే పారిపోతుండటం ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. వేసవి వేడి మధ్య తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు నీరు నిర్లక్ష్యంగా వృథా కావడం అధికారుల వైఖరిపై విమర్శలకు దారి తీస్తోంది. మూడేళ్ల క్రితం రోడ్డు మరమ్మతుల సమయంలో పైప్‌లైన్‌లో లీకేజీ గుర్తించినప్పటికీ, అప్పట్లో చేసిన తాత్కాలిక మరమ్మతులు మాత్రమే కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజులకే మళ్లీ పైపులు లీక్ అవుతూ సమస్య తిరిగి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి మరింత దారుణంగా మారింది. లీకేజీ వల్ల రోడ్డంతా నీటితో నిండిపోవడంతో చెరువును తలపించే దృశ్యం నెలకొంది. పాదచారులు జారిపడే



ప్రమాదం, వాహనదారులకు ఇబ్బందులు, సమీప దుకాణదారులకు వ్యాపార నష్టం రోజువారీ సమస్యలుగా మారాయి.రద్దీ గంజి మార్కెట్ ప్రాంతంలో రోజుకు రెండుసార్లు నీటి సరఫరా జరగడం వల్ల నీరు నిల్వ ఉండి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. నిల్వ నీటితో దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమల పెరుగుదలకూ దారితీస్తోంది. ముఖ్యంగా చిన్న వ్యాపారులు తమ దుకాణాల ముందు బురద నీరు నిల్వ ఉండటంతో కస్టమర్లు తగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు పలుమార్లు 58, 60 డివిజన్ కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించలేదని ఆరోపిస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులతో కాలయాపన చేయడం కాకుండా, పైప్‌లైన్‌ను పూర్తిస్థాయిలో మార్చి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.తాగునీటి సంరక్షణ, ప్రజల ఆరోగ్యం, వ్యాపారాల పరిరక్షణ దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కొత్త పాలకమండలి అయినా స్పందించి, మున్సిపల్ కమిషనర్, మేయర్ తదితరులు వెంటనే చర్యలు చేపట్టి నీటి వృథాను అరికట్టి ప్రజలకు ఉపశమనం కల్పించాలని గంజి మార్కెట్ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గాలివాన బీభత్సం

**- రోడ్లపై కూలిన చెట్ల తొలగింపు.**

**-ఎస్ఐ భూమేష్ ఆధ్వర్యంలో సత్వర చర్యలు.**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి , మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్, జైపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అకాల గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలుచోట్ల భారీ వృక్షాలు రహదారులపై కూలిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న జైపూర్ ఎస్ఐ భూమేష్ తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీస్ సిబ్బంది, స్థానిక గ్రామస్తుల సహకారంతో రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఎస్ఐ చొరవతో ప్రజలకు సత్వర ఉపశమనం లభించింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ మాలి శివకుమార్ రెడ్డి



**దోమ మండలం మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దోమ మండల కేంద్రంలో వరి కోనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ మాలి శివ కుమార్ రెడ్డి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొల్ల కవిత, వార్డు మెంబర్స్, సీనియర్ నాయకులు అధికారులు, గ్రామా ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు.....

**నాగారం మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహేశ్వరం శాసనసభ్యురాలు, మాజీ మంత్రి పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం మేడ్చల్ బిఆర్ఎస్ నాయకులు




గండి అంజయ్య గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు కు ఆమెను ఇంట్లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపికలు అందజేసారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు ఎలిజాల చిన్న శ్రీశైలం గౌడ్, నెల్లుట్ల విజయభాస్కర్, గండి శ్రీధర్ గౌడ్, ఏనుగు మహేందర్ రెడ్డి, గండి ఓం ప్రకాష్ గౌడ్, బందెల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల వద్ద నిలువు దోపిడీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- బీజేపీ నేతల ఆరోపణ**



**కరీంనగర్ రూరల్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ రూరల్ మండలంలోని ముగ్ధంపూర్ రాజీవ్ రహదారిపై బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పండించిన ధాన్యానికి తాలుతరుగు పేరుతో అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఏ గ్రేడ్ వడ్లను కామన్ గ్రేడ్ కింద లెక్కపెట్టి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన రైతు భరోసా హామీలు అమలు కాలేదని, రుణమాఫీ, కౌలు రైతులకు 15 వేల రూపాయలు, రైతు కూలీలకు 12 వేల రూపాయలు ఇవ్వాలన్న వాగ్దానాలు నెరవేరలేదని అన్నారు. తాలుతరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.రైతులపై దోపిడీని వెంటనే ఆపాలని బీజేపీ నేతలు హెచ్చరించారు.

## శ్రీ మహాశక్తి దేవాలయ ప్రాంగణంలో ఘనంగా హిందూ సమ్మేళనం




**కరీంనగర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చైతన్యపురి బస్తీలోని శ్రీ మహాశక్తి దేవాలయ ప్రాంగణంలో హిందూ సమ్మేళనం వైభవంగా జరిగింది.ప్రధాన వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ జయదేవ్ జీ మాట్లాడుతూ హిందూ సమాజం కులాలుగా విడిపోకుండా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. హిందూ ఐక్యతే సమాజానికి వెయ్యి ఏనుగుల బలం అని, సనాతన ధర్మం, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు.వందేళ్ల ఆర్ఎస్ఎస్ ప్రయాణం దేశహితం, ధర్మ పరిరక్షణ ధ్యేయంగా కొనసాగిందని, శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా 'పంచ పరివర్తన్' అంశాలను సమాజంలోకి తీసుకెళ్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, చైతన్యపురి హిందూ సమ్మేళన సమితి బాధ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంలో హిందూ ఐక్యతకు పిలుపునిచ్చిన సమ్మేళనం ఆధ్యాత్మిక శోభతో ముగిసింది.

## కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మ ముద్రించాలని డిమాండ్




**పెద్దపల్లి, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశంలో చలామణిలో ఉన్న కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బొమ్మను ముద్రించాలని ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు లింగమల్ల శంకరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్, పూలే, సావిత్రి బాయి జీవిత చరిత్రలు, రాజ్యాంగ అంశాలను పాఠ్యాంశాలలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మ ముద్రించేందుకు ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపడతామని తెలిపారు.నిట్టూరు పాఠశాలలో జరిగిన ఘటన ఎస్సీ, ఎస్టీ వర్గాల మనోభావాలను దెబ్బతీసిందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి దోషులను శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మ ముద్రించాలని లింగమల్ల శంకరయ్య చేసిన డిమాండ్ చర్చనీయాంశమైంది.

## హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ హోమం



**హుస్నాబాద్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మండలంలోని నాగారం గ్రామంలో హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక హనుమాన్ హోమం వైభవంగా జరిగింది. లోకకల్యాణార్థం గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు.ఉదయం నుంచి వేదమంత్రాలతో ఆలయ పరిసరాలు భక్తి వాతావరణంతో నిండిపోయాయి. గణపతి పూజతో ప్రారంభమైన వేడుకలో విశిష్ట అభిషేకాలు, అలంకారాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు కన్నుల పండుగగా జరిగాయి.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇజ్జగిరి సంపత్, ఉప సర్పంచ్ తిరుపతి, శివ, అనిల్ పాల్గొని హనుమాన్ భక్త బృందం కృషిని అభినందించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.గ్రామ ప్రజల అధిక సంఖ్యలో పాల్గొనడంతో హనుమాన్ హోమం విజయవంతంగా ముగిసింది.

## జిల్లా ఎస్సీ సెల్ పరిశీలకునిగా కొరివి అరుణ్ కుమార్ నియామకం



**కరీంనగర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
టీపీసీసీ ఎస్సీ సెల్ నూతన కమిటీల నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్సీ సెల్ పరిశీలకునిగా మాజీ జిల్లా చైర్మన్ కొరివి అరుణ్ కుమార్‌ను నియమిస్తూ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.పాత కమిటీలను రద్దు చేసి, కొత్త కమిటీల నియామకానికి కసరత్తు జరుగుతోందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా పరిశీలకుడిగా నియమితులైన అరుణ్ కుమార్ స్థానిక కాంగ్రెస్ నాయకుల నుండి దరఖాస్తులు స్వీకరించి నివేదికను రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్‌కు అందజేయనున్నారు.తన నియామకం పట్ల అరుణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.కొత్త కమిటీల నియామకానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిశీలకునిగా అరుణ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు.

# తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం

**- ఎమ్మెల్యే మక్కన్ సింగ్**



**పాలకుర్తి, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంగళవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా వచ్చిన గాలివానతో పాలకుర్తి మండల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఐకేపీ కేంద్రాల్లో ఆరబోసిన వరి ధాన్యం టర్పాలిన్ కవర్లు ఎగిరిపోవడంతో ధాన్యం తడిసి ముద్దయింది. బుధవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ ఐకేపీ కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. మిల్లర్లు, కేంద్ర నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా చూడాలని ఆదేశించారు. ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో గాలి వానకు చెట్లు విద్యుత్ స్తంభాలపై పడడంతో సరఫరా నిలిచిపోయింది. కరెంటు వైర్లు కింద పడడంతో ఒక కుక్క విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. స్థానికులు వెంటనే సమాచారం ఇవ్వడంతో అధికారులు స్పందించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రైతులకు భరోసా ఇచ్చారు.

## గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు కుట్రలో ప్రభుత్వం - సిపిఐ ఆరోపణ



**కరీంనగర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ఆలోచనలో ఉందని, సామాన్య ప్రజలపై భారం మోపితే చూస్తూ ఊరుకోమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ జెడ్పీటీసీ అందె స్వామి హెచ్చరించారు. బుధవారం కరీంనగర్ కమాన్ చౌరస్తా వద్ద సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధరల పెంపుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అందె స్వామి మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు విరుద్ధంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడం రైతులు, చిన్న వ్యాపారులు, పేద కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. వాణిజ్య సిలిండర్ ధర ఇప్పటికే 3100 రూపాయలకు చేరిందని, గృహ వంట గ్యాస్ ధరలు పెరిగితే పేద కుటుంబాలు జీవనోపాధి కష్టాల్లో పడతాయని ఆయన పేర్కొన్నారు. ధరల పెంపు ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపెల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ఇతర నాయకులు పాల్గొన్నారు. ధరల పెంపు ఆలోచనను విరమించకపోతే ప్రజా ఉద్యమాలు తప్పవని సిపిఐ నేతలు స్పష్టం చేశారు.

## కరీంనగర్ స్మార్ట్ సిటీ పనులకు 70 కోట్ల ఆమోదం



**కరీంనగర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హైదరాబాద్‌లో జరిగిన కరీంనగర్ స్మార్ట్ సిటీ స్పెవ్ బోర్డు సమావేశంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి మున్సిపల్ పరిపాలన ప్రధాన కార్యదర్శి డాక్టర్ టీ.కే. శ్రీదేవి అధ్యక్షత వహించారు. మేయర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధుల కింద 70 కోట్లతో ప్రతిపాదించిన అభివృద్ధి పనులను బోర్డు ఆమోదించిందని తెలిపారు. ఈ నిధులతో నగరంలో మల్టీ పర్పస్ పార్కింగ్ వ్యవస్థ, వరద కాలువ సమస్యల నివారణకు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అర్బన్ చాలెంజ్ ఫండ్, ఉసైఫ్ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి పనులపై కూడా చర్చ జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్, పోలీస్ కమిషనర్, ఇంజినీర్-ఇన్-చీఫ్, డీటీసీపీ, కార్పొరేషన్ ఇంజినీర్లు పాల్గొన్నారు. స్మార్ట్ సిటీ నిధులతో కరీంనగర్‌లో మౌలిక సదుపాయాల పనులు వేగవంతం కానున్నాయి.

# రైతులకు మార్కెటింగ్ సదుపాయాలపై అవగాహన సదస్సు



**కరీంనగర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : రైతు వారోత్సవాల సందర్భంగా కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో అవగాహన కార్యక్రమం జరిగింది. బ్యాంకుల ద్వారా పంట రుణాలు, సహకార సంఘాలు, ఎఫ్‌పిఓల సేవలు, మార్కెటింగ్ అవకాశాలపై అధికారులు రైతులకు వివరించారు. స్టేట్ అబ్జర్వర్ పి. ఈశ్వరయ్య మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాలు, సబ్సిడీ పథకాలు, మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి జె. భాగ్యలక్ష్మి రైతులు మార్కెట్ యార్డులు, గిడ్డంగులు, రైతు బజార్లు, ఈ-మార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకోవాలని చెప్పారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి ఆధునిక సాగు పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్‌పై అవగాహన కల్పించారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి రామానుజాచార్యులు సహకార సంఘాల ద్వారా రుణాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీపై వివరించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్ రైతులు ఎఫ్‌పిఓలు, రైతు బజార్ల ద్వారా మెరుగైన ధరలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుడు రణధీర్ రెడ్డి, కేడీసీసీ బ్యాంకు ఏజీఎం నాగరాజు, ఎఫ్‌పిఓ చైర్మన్ శంకరయ్య, మండల అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని గిట్టుబాటు ధరలు పొందాలని అధికారులు పిలుపునిచ్చారు.

# మహిళల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం





**కరీంనగర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ ప్రభుత్వ మహిళల డిగ్రీ కళాశాల (అటానమస్)లో 2026--27 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. శాతవాహన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఎన్ఏఏసీ గ్రేడ్-ఏ గుర్తింపు పొందిన ఈ కళాశాల మహిళల ఉన్నత విద్యకు నాణ్యత, నైపుణ్యం, ఉపాధి అవకాశాలను కలిపిన వేదికగా నిలుస్తోంది. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి మాట్లాడుతూ, పరిశ్రమలకు అనుగుణంగా విద్యార్థినులు నైపుణ్యాలు సాధించేందుకు అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రాం (ఏఈడీపీ) ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇందులో బి.ఎస్.సి. హెల్త్‌కేర్ మేనేజ్మెంట్, బి.కాం. బ్యాంకింగ్, ఫైనాన్స్, సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బిఎఫ్ఎస్ఐ) కోర్సులు విద్యార్థినులకు ఆసుపత్రులు, బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో ప్రత్యక్ష శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాయని వివరించారు. అదనంగా బి.ఎస్.సి. (భౌతిక శాస్త్రాలు, జీవ శాస్త్రాలు), బి.కాం. (కంప్యూటర్ అప్లికేషన్లు), బి.ఏ. వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆధునిక డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, 18,000 పైగా పుస్తకాలతో లైబ్రరీ, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, క్రీడలు, ఉద్యోగోన్నతి కోర్సులు (యోగ, కరాటే, బ్యూటీషియన్, మొబైల్ మరమ్మత్తు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు) విద్యార్థినులకు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థినులు వెంటనే దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, పరిమిత సీట్లు ఉన్నందున ముందుగా వచ్చిన వారికి ప్రాధాన్యం ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించే వేదికగా మహిళల డిగ్రీ కళాశాల అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి.

## మోదీ సభ విజయవంతం చేయాలని బీజేపీ నేతల పిలుపు



**కరీంనగర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మే 10న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. మానకొండూర్ మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్ల రమేష్ మాట్లాడుతూ, మూడవసారి ప్రధానమంత్రిగా ఎన్నికైన తర్వాత తెలంగాణలో జరుగుతున్న తొలి సభకు ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా, మండల నాయకులు, మహిళా మోర్చా, కిసాన్ మోర్చా, బీజేవైఎం ప్రతినిధులు పాల్గొన్నారు. ఇక కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి అత్యధిక సంఖ్యలో ప్రజలను తరలించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రత్యేక దృష్టి సారించారు. గత నాలుగు రోజులుగా కరీంనగర్‌లో మకాం వేసి పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. మండలాలు, గ్రామాల వారీగా జన సమీకరణ లక్ష్యాలను నిర్దేశించి, వెయ్యి కార్లు, 250 బస్సులు ఏర్పాటు చేసి వేలాదిమందిని సభకు తరలించాలని నిర్ణయించారు. రేపటి నుండి సికింద్రాబాద్‌లో మకాం వేసే బండి సంజయ్, ముషీరాబాద్ అసెంబ్లీ నేతలు, ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఎల్లుండి బైక్ ర్యాలీ, పాదయాత్రల ద్వారా ఇంటింటికీ వెళ్లి సభకు ఆహ్వానించేలా ప్రణాళిక రూపొందించారు. మహిళా మోర్చా కార్యకర్తలు కూడా తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి సభకు ఆహ్వానించాలని సూచించారు. మోదీ సభను విజయవంతం చేయడానికి బీజేపీ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

## సైదాపూర్ మండలంలో చోరీ కలకలం




**హుస్నాబాద్ , మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామంలో జరిగిన చోరీ ఘటన స్థానికులను కలవరపరిచింది. గ్రామానికి చెందిన బుసుమల్ల అనిల్ కుమార్ ఇంటి ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి గుర్తు తెలియని దుండగులు లోపలికి చొరబడి బంగారు నాణు కాడాలు, గొలుసులు, పుస్తెలు, డిన్నర్ సెట్ వంటి సామాన్లను అపహరించారు. ఇంటి తాళం పగిలి ఉండటాన్ని గమనించిన అనిల్ మేనత్త పద్మ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామంలో జరిగిన ఈ చోరీతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

## జిల్లా వ్యాప్తంగా పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే



**కరీంనగర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రారంభమైంది. జిల్లా గణాంక అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ ఈ సర్వేను నిర్వహించారు. కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ను కలిసిన ఆయన సర్వే కరపత్రాలను అందించి ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ గణాంక శాఖ 2026 సంవత్సరానికి ప్రజల ఉపాధి స్థితిగతులపై ఈ సర్వే చేపడుతోంది. మొదట కుటుంబాల సాధారణ వివరాలు నమోదు చేసి, అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా ఎంపిక చేసిన కుటుంబాలను మూడు నెలల పాటు నెలకు ఒకసారి సర్వే చేస్తామని అధికారులు తెలిపారు. ఇందులో విద్యా అర్హతలు, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలీల పనిగంటలు, వేతనాలు, మహిళల ఆదాయ వివరాలు నమోదు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గంట శ్రీనివాస్, మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ నాగారపు హరికృష్ణ, సిబ్బంది రమ్య, కల్పన, తంగళ్ళపల్లి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధి స్థితిగతులపై సమగ్ర సమాచారం కోసం కరీంనగర్‌లో లేబర్ ఫోర్స్ సర్వే కొనసాగుతోంది.

## ఒక్క రక్తదానం అనేక ప్రాణాలకు జీవదానం



**కరీంనగర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలసేమియా దినోత్సవం సందర్భంగా తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించబడుతోంది. సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి మాట్లాడుతూ, తలసేమియా బాధితులకు నిరంతరం రక్తం అవసరమవుతుందని, ఒకరి రక్తదానం అనేక ప్రాణాలకు జీవదానంగా మారుతుందని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, యువత పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరం మే 8వ తేదీ ఉదయం 8 గంటలకు కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జరుగనుంది. స్వచ్ఛందంగా రక్తదానం చేయదలచిన వారు పేరు, రక్తగ్రూప్, ఫోన్ నంబర్ వివరాలను పంపించి ముందస్తు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఒక్క రక్తదానం అనేక ప్రాణాలకు జీవదానం అనే నినాదంతో ఈ సేవా కార్యక్రమం విజయవంతం కావాలని సంస్థ కోరుతోంది. సంప్రదించవలసిన నంబర్:8143538604

## ధాన్యం కొనుగోళ్లపై అదనపు
# కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సమీక్ష

**గంగాధర, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ధాన్యం కొనుగోళ్లపై ఎదురవుతున్న సమస్యలపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో మహేశ్వర్, డీసీఎస్ఓ నర్సింగరావు, తహసీల్దార్ రజిత, ఎంపీడీఓ దమ్మని రాము, డీటీసీఎస్ ఉషా, ఐకేపీ ఏపీఎం కుమార్, పిఎసిఎస్ సీఈఓలు పాల్గొన్న సమావేశంలో కొనుగోళ్ల తీరును, సెంటర్లలో ఎదురవుతున్న ఇబ్బందులను చర్చించారు. అనంతరం ఏఎంసీ మార్కెట్‌లో కొనుగోళ్లను పరిశీలించారు. నాగిరెడ్డిపూర్ సెంటర్‌లో రైతులను కలసి సమస్యలు తెలుసుకున్న అదనపు కలెక్టర్, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, రైతుల వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. లారీల కొరతను అధిగమించేందుకు గంగాధర మండలానికి అదనంగా వాహనాలను సమకూర్చినట్లు తెలిపారు. రైతులకు కనీస అవసరాలు అందుబాటులో ఉండేలా సెంటర్ నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు. అంతకు ముందు ఆర్డీవో ఉప్పర మల్యాల గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి సూచనలు ఇచ్చారు. రైతుల ఇబ్బందులు తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు.



## కాంగ్రెస్ పాలనలో ఆర్యవైశ్యులకు అన్యాయం

- నాగరాజు గుప్త

**మర్రిగూడ, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బురుగు నాగరాజు గుప్త కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆవేదన వ్యక్తం చేశారు. మర్రిగూడలో విలేకరులతో మాట్లాడుతూ, "గత ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులు లభించాయి. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను కూడా పట్టించుకోని పరిస్థితి నెలకొంది" అని అన్నారు. ఇకనైనా ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



## ధాన్యం తరుగు కోతలకు ఎమ్మెల్యే మేడిపల్లి
# సత్యం బాధ్యత వహించాలి

-సింగిరెడ్డి కృష్ణారెడ్డి

**గంగాధర, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో అదనపు ధాన్యం తూకం వేస్తున్న దోపిడీకి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బాధ్యత వహించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గంగాధర చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో రైతులు, బీజేపీ నాయకులు రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని కావాలనే బి-గ్రేడ్గా మార్చి క్వింటాల్‌కు రూ. 20 చొప్పున ధరలో కోత విధిస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడం వల్ల తేమ శాతం తగ్గి రైతులు క్వింటాల్‌కు అదనంగా 6 కిలోల ధాన్యం నష్టపోతున్నారని తెలిపారు. ఎఫ్‌సీఐ నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ అండతో మిల్లర్లు దోపిడీ చేస్తున్నారని, తహసీల్దార్లు కేంద్రాలను సందర్శించకపోవడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్ నేతలు చేసిన తరుగు దోపిడీని ఇప్పుడు కాంగ్రెస్ కొనసాగిస్తోందని ఎద్దేవా చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి తరుగు కోతలు లేకుండా వెంటనే లారీల సంఖ్యను రెట్టింపు చేయాలని, నాణ్యమైన ధాన్యాన్ని బి-గ్రేడ్ కింద కొనుగోలు చేస్తున్న మిల్లర్లపై, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సివిల్ సప్లై అధికారులపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతు ప్రయోజనాలను గాలికొట్టితే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి బీజేపీ నాయకులు, కిసాన్ మోర్చా ప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, యువజన నాయకులు పాల్గొన్నారు. రైతులపై జరుగుతున్న తరుగు దోపిడీని అరికట్టాలని బీజేపీ నేతలు స్పష్టం చేశారు.



## అస్మత్‌పూర్‌లో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



**ఇబ్రహీంపట్నం, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంచాల మండలం అస్మత్‌పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ, "అస్మత్‌పూర్ గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. ఆంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలి. తెలంగాణ పల్లెలు సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లులు. ప్రజల నమ్మకాలను గౌరవించేలా ఆలయాల పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివ యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా విజయవంతం

**పెద్దపల్లి, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల దిశగా పెద్దపల్లిలో మెగా జాబ్ మేళా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారానే ఉపాధి సాధ్యమని, టాస్క్, ఏటీసీ, స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఆధునిక నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పెద్దపల్లిలో టాస్క్ రీజినల్ సెంటర్ ఏర్పాటు చేసి ఇప్పటివరకు 261 మంది మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారని చెప్పారు. ఈ జాబ్ మేళాలో 77 కంపెనీలు పాల్గొని 4 వేల ఉద్యోగ అవకాశాలను ప్రకటించగా, 1200 మంది విద్యార్థులు షార్ట్‌లిస్ట్ అయ్యారు. 647 మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఐటీ, బిపిఓ, మార్కెటింగ్, ఉత్పత్తి రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదని విమర్శిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. విజయరమణారావు మాట్లాడుతూ టాస్క్ ద్వారా శిక్షణ పొందిన యువత మల్టీనేషనల్ కంపెనీల్లో అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందారని చెప్పారు. ఎమ్మెల్యే మక్కన్ సింగ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రైవేట్ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. రామగుండంలో కూడా మెగా జాబ్ మేళా నిర్వహించాలని కోరారు. యువత నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ప్రభుత్వం -- పెద్దపల్లిలో మెగా జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది.



## ఎలిగేడు ధూళికట్ట సహకార సంఘంలో కొత్త ఇంచార్జీ



**ఎలిగేడు, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఎలిగేడు మండలం ధూళికట్ట సహకార సంఘం పర్సన్ ఇంచార్జీగా పుల్లూరి వేణుగోపాల్ రావు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం అధికారులను ఇంచార్జీలుగా నియమించింది. హైకోర్టు తీర్పు అనంతరం ఇప్పటి వరకు ఇంచార్జీగా ఉన్న అహ్మద్ అలీ నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, సహకార సంఘం బద్ధం రవీందర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పాల్గొన్న డైరెక్టర్లు

# ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన

**పెద్దపల్లి, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి మండలంలోని బొంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు ఆయనను ఆహ్వానించి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామ ప్రజలు, రైతాంగం సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ కురవాలని ఆయన ప్రార్థించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు దాసరి మనోహర్ రెడ్డిని శాలువాతో సన్మానించి తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు. పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపనతో బొంపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



## ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడు మేడిపల్లి సత్యం

**గంగాధర, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండలం గొల్లపెల్లి గ్రామానికి చెందిన మోతుకు మహేష్ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్థానిక నాయకులు తెలియజేయగా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వెంటనే స్పందించారు. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం ఎనిమిది లక్షల రూపాయల ఎల్ఓసీని మహేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తానని మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు.



# రైల్వే లైన్ నిర్వాసితులకు భూమి కేటాయింపుకు చర్యలు



**గంగాధర, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్** : కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రైల్వే లైన్ కారణంగా ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితుల సమస్యపై అధికారులు స్పందించారు.కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, ఎమ్మార్వో రజిత, గ్రామ సర్పంచ్ దాసరి శంకరయ్య, ఉపసర్పంచ్ దేవా బహదూర్ రెడ్డి, వార్డు సభ్యులు, భూ నిర్వాసితులు సమావేశమై చర్చించారు. ఇండ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వ ఇండ్ల స్థలాలను కేటాయించే దిశగా ఆర్డీవో చొరవ తీసుకున్నారు. రెండు మూడు రోజుల్లో ఎక్కడ భూమి కేటాయించాలనే అంశంపై నిర్వాసితులతో ముఖాముఖి మాట్లాడి నిర్ణయం తీసుకోవాలని అధికారులు తెలిపారు. నిర్వాసితులు త్వరగా భూమి కేటాయించాలని కోరారు.రైల్వే లైన్ నిర్వాసితుల సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు ప్రారంభించారు.

# ఉచిత వైద్య సేవలపై ఉదారతను చాటాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి పిలుపు



**మానకొండూర్, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడంలో ప్రైవేటు ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు.కరీంనగర్‌లోని రెనీ హాస్పిటల్‌లో దివంగత బంగారి లక్ష్మీ--మైసయ్యల స్మారకార్థం శ్రీ మహేశ్వర చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్న 15 మంది పేషెంట్ల డిశ్చార్జ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఖర్చుతో కూడుకున్న శస్త్రచికిత్సలను ఉచితంగా అందించడం సంతోషకరమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించాలని ట్రస్ట్ నిర్వాహకులను, ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు, పేషెంట్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.హుస్నాబాద్‌లోని కే.జే.ఆర్ గార్డెన్స్‌లో జరిగిన ఎరుక రాజయ్య గౌడ్--భాగ్యమ్మ కుమార్తె రమ్య వివాహానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే నగునూర్‌లోని బీ.ఎం.ఆర్ గార్డెన్స్‌లో తన గన్‌మెన్ తమ్మనవేణి రమేశ్ యాదవ్ వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.ఉచిత వైద్య సేవలతో పాటు ప్రజా జీవితంలోనూ, వ్యక్తిగత సందర్భాల్లోనూ ప్రజలతో మమేకమవుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.

# అంగరంగ వైభవంగా మడలేశ్వర స్వామి

## --సీతాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



**కొండపాక, మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కొండపాక మండలం సిరిసినగండ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ మడలేశ్వర స్వామి సమేత శ్రీ సీతాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున నుంచే శాస్త్రోక్త పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తజన సందోహం మధ్య కన్నుల పండుగగా జరిగిన ఈ మహోత్సవంలో గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి పాల్గొని ఆశీర్వాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, రజక సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల కనకయ్య, సముద్రాల ఆంజనేయులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.విగ్రహ ప్రతిష్ట అనంతరం దేవత అర్చనలు, మహానైవేద్యం, మంగళ నీరాజనాలు నిర్వహించి తీర్థప్రసాదం పంపిణీ చేశారు. స్వామి నామస్మరణతో గ్రామ వీధులు మారుమోగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ మహోత్సవం గ్రామ ప్రజలకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించింది.

### ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని

# ఆదర్శంగా తీర్చిదిద్దటమే లక్ష్యం

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి...
-గున్ గల్, గడ్డమల్లయ్యగూడెం గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
-కాంగ్రెస్ లో చేరిన గడ్డమల్లయ్యగూడెం సర్పంచ్ మంగజంగయ్య




**ఇబ్రహీంపట్నం , మే 06( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** .తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చినా 9ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఇబ్రహీంపట్నం ప్రాంతం అభివృద్ధిలో వెనకబడిందని నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దటమే లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు . యాచారం మండలం గున్ గల్, గడ్డమల్లయ్యగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. రూ.1.20కోట్లతో చేపట్టిన రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి కార్యక్రమాలకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా గడ్డమల్లయ్యగూడెం సర్పంచ్ మంగాజంగయ్య ఎమ్మెల్యే మల్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. మల్ రెడ్డి రంగారెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులైనందునే ఆయన వెంట నడిచేందుకు సిద్ధమైనట్లు వారు తెలిపారు. రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధికి కావాల్సిన నిధులను అడిగిన వెంటనే మంజూరు చేస్తున్నట్లు చెప్పిన ఎమ్మెల్యే.ప్రజాప్రభుత్వంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లు ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన

-ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
-పేదలకు అండగా కల్యాణలక్ష్మి షాది ముభారక్




**ఇబ్రహీంపట్నం, మే 06( నీలగిరి ఎక్స్ ప్రెస్)** ఆడబిడ్డల పెళ్లికి ప్రభుత్వం ఇస్తున్న కానుక కల్యాణలక్ష్మి పేదలకు అండగా నిలుస్తున్నదని వారి కుటుంబానికి ధైర్యమే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. యాచారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల ను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పంపిణీ చేశారు. యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 310మంది లబ్ధిదారులకు 3కోట్ల 10లక్షల 35వేల 390 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవలని, జాప్యం లేకుండా నిధులు మంజూరు అవుతున్నట్లు ఆయన తెలిపారు. సంక్షేమం - అభివృద్ధి జోడెద్దుల్లా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మస్కు అనిత శరణం, యాచారం మండల తహశీల్దార్ అయ్యప్ప , ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు , మాజీ వైస్ ఎంపీపీలు గంజి రామకృష్ణ యాదవ్, శ్రీనివాసరెడ్డి వివిధ గ్రామాల సర్పంచ్ లు , మాజీ సర్పంచ్ లు ప్రజా ప్రతినిధులు, మాజీ ఎంపీటీసీలు మాజీ జెడ్పిటిసి స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టి పరిస్థితుల్లోనూ

# విజయ్ పార్టీకి సహకరించం..

### అన్నాడీఎంకే సంచలన ప్రకటన..!

**న్యూఢిల్లీ మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తమిళనాడు లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే టీవీకే అధ్యక్షుడు విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మరో ఆరు సీట్లు తక్కువ పడుతున్నాయి. విజయ్‌కి కాంగ్రెస్ పార్టీ మాత్రమే మద్దతు పలికింది. వీసీకే, సీపీఐ, సీపీఐ (ఎం), ఐయూఎంఎల్ లాంటి చిన్న పార్టీలు మాత్రం టీవీకేకు మద్దతిచ్చేందుకు ససేమీరా అంటున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్‌కి అన్నాడీఎంకే మద్దతిచ్చే అవకాశాలు ఉన్నాయంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారాన్ని అన్నాడీఎంకే పార్టీ కొట్టిపారేసింది.అన్నాడీఎంకే డిప్యూటీ కోఆర్డినేటర్ కేపీ మునుసామి బుధవారం సాయంత్రం మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి విజయ్‌కి కావాల్సిన స్థానాలు, వచ్చాయా లేదా అనే అంశంతో తమకు సంబంధం లేదని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ టీవీకేకు అన్నాడీఎంకే సహకరించదని స్పష్టంచేశారు. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో విజయ్ పార్టీ 108 సీట్లు గెలుచుకుంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు అవసరం. కాంగ్రెస్ పార్టీ డీఎంకేను పక్కన పెట్టి, విజయ్‌కి మద్దతిస్తోంది.అయినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మరికొందరు ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే పార్టీలోని పలువురు ఎమ్మెల్యేలు విజయ్‌కు మద్దతివ్వాలని పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నట్లు వార్తలు వచ్చాయి. అన్నాడీఎంకేకు 47 మంది ఎమ్మెల్యేలు ఉండగా.. సుమారు 30 మంది విజయ్‌తో చేతులు కలపడానికి సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే విజయ్‌తో కలిసేందుకు పార్టీ అధినేత పళనిసామి మాత్రం సుముఖంగా లేరని తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీ డిప్యూటీ కోఆర్డినేటర్ మునుసామి నుంచి పై ప్రకటన వెలువడింది.

# విజయ్‌కి తమిళనాడు గవర్నర్ షాక్

### మెజారిటీ లేనిదే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించలేం..



**న్యూఢిల్లీ మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తమిళనాడు రాజకీయాలు అనూహ్య మలుపు తిరిగాయి. ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైన టీవీకే అధినేత విజయ్ కి గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాకిచ్చారు. లోక్‌భవన్ లో గవర్నర్‌ను కలిసిన విజయ్‌కి ఆయన సంఖ్యాబలం విషయంలో స్పష్టమైన నిబంధనలను గుర్తుచేశారు. తగినంత మెజారిటీ లేనిదే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేమని స్పష్టంచేశారు. దాంతో తమిళనాడులో రాజకీయ సస్పెన్స్ మరింత ముదిరింది.తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన మ్యాజిక్ ఫిగర్ 118. అయితే ప్రస్తుత సమీకరణాల ప్రకారం టీవీకే బలం 107 సీట్లు. విజయ్ రెండుచోట్ల గెలవడంతో ఒక సీటుకు రాజీనామా చేయాల్సి ఉంటుంది. కాబట్టి ప్రస్తుతం టీవీకే బలం 107 మాత్రమే. మద్దతు ఇస్తున్న కాంగ్రెస్ బలం 5 సీట్లు. దాంతో మొత్తం బలం 112 అవుతుంది. ఈ క్రమంలో విజయ్ పార్టీకి మరో 6 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఈ క్రమంలోనే మెజారిటీ లేనందున ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదువిజయ్ గవర్నర్‌తో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోపాటు మరికొన్ని చిన్న పార్టీలు తమకు మద్దతు ఇస్తున్నాయని, ప్రమాణస్వీకారం తర్వాత అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకుంటామని చెప్పారు. అయితే ముందే 118 మంది సభ్యుల సంతకాలతో కూడిన మద్దతు లేఖ ఉంటేనే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతిస్తామని గవర్నర్ స్పష్టం చేశారు. దాంతో ఇతర పార్టీల మద్దతు కూడగట్టే పనిలో టీవీకే ఉన్నది. ఈ క్రమంలో అన్నాడీఎంకే పార్టీకి ఉన్న 47 మంది ఎమ్మెల్యేలలో సీవీ షణ్ముగం నేతృత్వంలోని ఒక వర్గం (సుమారు 35 మంది) విజయ్‌కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు పీఎంకే (4), ఐయూఎంఎల్ (2), సీపీఐ (2), సీపీఎం (2) వంటి పార్టీల మద్దతు కూడా కూడగట్టడంపై టీవీకే నేతలు చర్చలు జరుపుతున్నారు. ప్రస్తుతానికి ఈ 6 మంది ఎమ్మెల్యేల కొరత తీరితే తప్ప విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం లేదు. మే 9న ప్రమాణస్వీకారం చేయాలని టీవీకే భావిస్తున్న తరుణంలో వచ్చే 24 గంటలు అత్యంత కీలకంగా మారాయి.

# ఆ పిటిషన్‌పై విచారణ వాయిదా వేయాలన్న కేంద్రం..

### తిరస్కరించిన సుప్రీంకోర్టు..!



**న్యూఢిల్లీ మే 6 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యత్వాన్ని తొలగిస్తూ.. కొత్త చట్టం చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు లో విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆ పిటిషన్‌పై విచారణ వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. అయితే కేంద్రం అప్పీల్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. తాను 'శబరిమలలో మహిళల ప్రవేశం' కేసును పర్యవేక్షిస్తున్నందున కేసును కొద్ది రోజులపాటు వాయిదా వేయాలని కేంద్రం తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా న్యాయస్థానాన్ని కోరారు.కాగా తుషార్ మెహతా అభ్యర్థనను జస్టిస్ దీపాంకర్ దత్త తిరస్కరించారు. ఈ పిటిషన్‌పై విచారణ అత్యంత ముఖ్యమైనదిగా పేర్కొన్నారు. చాలా రోజుల క్రితమే విచారణ తేదీని ఖరారు చేశామని, ఇప్పుడు వాయిదా వేయడం కుదరదని స్పష్టంచేశారు. శబరిమల కేసును అసలు విచారించకపోవడమే మంచిదని మంగళవారం 9 మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసం చేసిన వ్యాఖ్యలను జస్టిస్ దత్తా ప్రస్తావించారు. కాగా సీఈసీ, ఈసీ నియామకాల ఎంపిక కమిటీల్లో భారత ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్రమంత్రిని తీసుకునేందుకు ప్రతిపాదిస్తూ కేంద్రం చట్టం చేసింది. అయితే ఈ చట్టాన్ని దుర్వినియోగం చేసి కేంద్ర ప్రభుత్వం తమకు అనుకూలమైన అధికారులను ఎన్నికల అధికారులుగా నియమించుకునే అవకాశం ఉందని పలువురు ఆందోళన లేవనెత్తారు.ఇప్పటికే ఈ చట్టం కింద జరిగిన నియామకాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం ఆ పిటిషన్లపై విచారణ జరుగుతోంది.